# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 6, ఏప్రిల్ 2026


## అకాల వర్షంతో ప్రజలు కష్టాలు



**బెజ్జూర్, ఏప్రిల్ 5,ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలో ఆదివారం తెల్లవారుజామున వచ్చిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండల ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు.బాపుగూడలో ఈదురు గాలుల దాటికి విద్యుత్ స్తంభం విరిగి పడింది.ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎంతో అపాయం తప్పింది.అందుగుల గూడ గ్రామంలో ఆలం బుచ్చిరామ్, దసరయ్య ఇండ్ల రేకులు లేచిపోయి ఇంట్లోని నిత్యవసర సామాగ్రి,నిలువ ఉంచుకున్న వడ్లు తడిసిపోయాయి.అలాగే బారెగూడ గ్రామానికి చెందిన డోకె మహేష్ యొక్క మూడు ఎకరాల మొక్కజొన్న పంట నేల పాలయింది. పోతేపల్లి గ్రామానికి చెందిన డోకె సంజీవ్ పిడుగుపాటుకు గురయ్యాడు.అతన్ని బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కాగజ్నగర్ కు తరలించారు.మండలంలో నష్టపోయిన మొక్కజొన్న రైతులు,ప్రజలు తమకు ప్రభుత్వం సహాయం చేసే ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఆసిఫాబాద్ ఎమ్మెల్యేను
### హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంకు పోలీసులు ఉదయానే చేరుకొని ఎమ్మెల్యేను ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో ఎటూ వెళ్లకుండా హౌస్ అరెస్ట్ చేశారు. ఖానాపూర్ వెళ్లడం లేదని స్పష్టంగా చెప్పినప్పటికీ ఎమ్మెల్యేను అక్రమంగా గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో గెలవలేక ప్రతిపక్ష నాయకులను కట్టడి చేయాలనుకోవడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం అత్యంత దుర్మార్గమని, ఒక ఆదివాసీ ఎమ్మెల్యే మారుమూల ప్రాంతాలకి వెళ్లే సమయంలోకి పోలీస్ ఎస్కార్ట్ ఇవ్వని ఈ ప్రభుత్వం ఇలాంటి ముందస్తు అరెస్ట్ లు చెయ్యడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసారు.





## విద్యారంగ అభివృద్ధి దిశగా
### ప్రభుత్వం చర్యలు

**✻ జిల్లా కలెక్టర్ కె.హరిత**

**కాగజ్నగర్ రూరల్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:**

విద్యారంగా అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం జిల్లాలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం స్థాపన కోసం ప్రతిపాదించిన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. మిగతా 2లో



## గురుకుల పాఠశాలలో
### మరో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- ✻ తోటి విద్యార్థినితో గొడవపడి డెటాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ విద్యార్థిని
- ✻ వారం క్రితం శ్రీహిందు ఆత్మహత్య మరువకముందే మరో ఘటన
- ✻ గురుకుల పాఠశాలల్లో కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ✻ వరుస ఘటనలతో భయాందోళన చెందుతున్న తల్లిదండ్రులు



**చెన్నూరు, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :**

చెన్నూరు సాంఘీక సంక్షేమ గురుకులాల్లో జరుగుతున్న వరుస ఘటనలతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా భయాందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వారం క్రితం ఇదే పాఠశాలలో చదువుతున్న శ్రీహిందు ఆత్మహత్య మరువకముందే శనివారం సాయంత్రం సుమారుగా ఆరుగంటల సమయంలో మరో విద్యార్థిని డెటాల్ తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. పోలీసులు, పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం లోని నర్వ గ్రామానికి చెందిన గొట్టాల శరణ్య చెన్నూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుందని, తన తోటి స్నేహితురాలితో గొడవ పెట్టుకున్న శరణ్య పక్కనే ఉన్న బాత్ రూమ్ కి వెళ్ళి డేట్టాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించి ప్రభుత్వ హాస్పిటల్లో చేర్చామని తెలిపారు. మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించామని, ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోందని పేర్కొన్నారు. వరుస ఘటనల నేపథ్యంలో గురుకుల పాఠశాలల్లో భద్రత, పర్యవేక్షణ పూర్తి స్థాయిలో లేనందున తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

## ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



**✻ ఎస్పీ నితికా పంత్**

**కెరమెరి, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:**

ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నికిత పంత్ అన్నారుపోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా కెరమెరి పోలీసుల ఆధ్వర్యంలో, మెడిలైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సన్ షైన్ హాస్పిటల్ మంచిర్యాల వారి సహకారంతో కెరమెరి పోలీస్ స్టేషన్ సమీపంలోని స్టార్ గార్డెన్స్ లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ నితికా పంత్ హాజరై మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు.ఈ మెడికల్ క్యాంపులో సుమారు 900 మంది ప్రజలు పాల్గొని ఈసీజీ, 2డి ఇకో, షుగర్ పరీక్షలు, బీపీ చెక్అప్, కంటి పరీక్షలు వంటి వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జనరల్ మెడిసిన్, పల్మనాలజీ,ఆర్తోపెడిక్, గైనకాలజీ,రేడియోలజీ, జనరల్ సర్జరీ, న్యూరో ఫిజీషియన్, డెంటల్, ఇ.ఎన్.టి వైద్యులు చికిత్సలు నిర్వహించారు. మిగతా 2లో.

## ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న నైట్ వాచ్ మెన్ మృతి

**హాజీపూర్, ఏప్రిల్ 5,ప్రభాత వార్త :**

హాజీపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో నైట్ వాచ్ మెన్గా పనిచేస్తున్న కొత్తకొండ తిరుపతి అనే ఉద్యోగి శనివారం రోజున విధుల్లో ఉండగానే మృతి చెందినట్లు ఎస్.ఐ. కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం తాళ్లపల్లి గ్రామం, నస్పూర్ మండలానికి చెందిన కొత్తకొండ తిరుపతి (53)అను అతను గత రెండు సంవత్సరాల నుండి హాజీపూర్ ఎంపీడీఓ ఆఫీసు లో నైట్ వాచ్మెన్గా డ్యూటి చేస్తున్నాడు. మిగతా 2లో.

# ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

మొదటిపేజి తరువాయి

కంటి అద్దాలు అవసరమైన 50 మందికి అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ... ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ఏ సమస్య వచ్చినా సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా డయల్ 100ను సంప్రదించాలని సూచించారు. పోలీసు శాఖ ప్రజల భద్రతతో పాటు వారి ఆరోగ్య సంక్షేమం పట్ల కూడా బాధ్యతతో పనిచేస్తుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, కెరమెరి సబ్ ఇన్స్పెక్టర్ మధుకర్, వాంకిడి సబ్ ఇన్స్పెక్టర్ మహేందర్, వైద్య బృందం, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయంలో పనిచేస్తున్న నైట్ వాచ్ మెన్ మృతి

మొదటిపేజి తరువాయి

శనివారంరోజున తిరుపతి నైట్ డ్యూటి కొరకు ఎంపీడీఓ ఆఫీసు కి వచ్చి డ్యూటి చేస్తూ తెల్లవారి అనగా ఆదివారం రోజున ఉదయం చూసేసరికి తిరుపతి చనిపోయి ఉన్నాడు. తిరుపతి రాత్రి సమయం లో అనారోగ్య కారణంతో లేదా మరి ఏ ఇతర కారణంతో అయిన చనిపోయి ఉండవచ్చు అని మృతుని కొడుకు కొత్తకొండ సాయికుమార్ ధరఖాస్తు ఇవ్వగా కేసు నమోధు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్. ఐ. తెలిపారు. మృతునికి బార్య, ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు.

## కాగజ్‌నగర్‌లో అట్టహాసంగా మహర్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:**

కాగజ్‌నగర్ పట్టణంలోని శిశిలీ గ్రౌండ్‌లో మహర్ ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి స్థానిక యువత మరియు క్రీడాభిమానుల నుండి విశేష స్పందన లభించింది. ఈ టోర్నమెంట్‌ను యువకుల సమన్వయంతో మేడి కార్తీక్ మరియు సంతోష్ డోంగ్రే ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ రావుజీ సునీత దంపతులు, మేడి చరణ్ దాస్, సూరజ్, సునీల్, జాడి దీపక్, సాగర్, జుమిడి సంతోష్ డోంగ్రే తదితరులు హాజరై క్రీడాకారులను ప్రోత్సహిస్తూ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని, శారీరక దృఢత్వంతో పాటు ఐక్యత, సామాజిక బంధాలను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో సరసాల టీం మరియు జైభీమ్ టీంల మధ్య ఆసక్తికర పోటీ జరిగింది. ఈ మ్యాచ్‌కు జాడి శ్యాంరావు టాస్ వేయడంతో టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున హాజరైన క్రీడాభిమానులు, గ్రామ ప్రజలు ఆటగాళ్లను ఉత్సాహపరుస్తూ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. మొత్తానికి, మహర్ ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) ప్రారంభం కాగజ్‌నగర్‌లో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేస్తూ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపిన వేడుకగా నిలిచింది.



## బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు ఆదర్శనీయం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :**

బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత మాజీ ప్రధాని, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డా. బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి.అహ్మద్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తో కలిసి హాజరై బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేశారని, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర సమరయోధుడిగా, గొప్ప పరిపాలన దక్షుడిగా అన్ని వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. దేశానికి మూడు దశాబ్దాల పాటు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా సేవలు అందించిన గొప్ప మేధావి అని, నేటి తరానికి ఆదర్శనీయులని అన్నారు. మహనీయుల ఆశయాలను కొనసాగించి జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని తెలిపారు. అసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం, సమానత్వం, సమన్యాయం, ఐక్యత కోసం బాబు జగ్జీవన్ రామ్ చూపిన మార్గం ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి యం.అశోక్, కుల సంఘాల ప్రతినిధులు కేశవరావు, సిడాం అర్జు, గంగుబాయి, గణేష్, శంకర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు

మొదటిపేజి తరువాయి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా రంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలోనూ అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని, ఇందులో భాగంగా స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, విద్యాలయం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమాజ సవరణ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రం నం.62 ను సందర్శించి బూత్ స్థాయి అధికారితో పనుల నిర్వహణపై సమీక్షి ంచారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని, నూతన ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల కొరకు ఫారం 6, 7, 8 ల ద్వారా అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పష్టమైన ఓటరు జాబితా తయారీలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరపున నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం రహదారులు భవనాల శాఖ అతిథి గృహాన్ని సందర్శించి ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు కొరకు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఎస్ ఐ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రి వార్డులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో లేకపోవడంతో తగు చర్యల నిమిత్తం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ మండల తహాశీల్దార్, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ జయంతి

**వాంకిడి, ఏప్రిల్ 5: ప్రభాత వార్త**



వాంకిడి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి కార్యక్రమాన్ని వాంకిడి సర్పంచ్ చూనార్కర్ సతీష్ ఆధ్వరములో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాంకిడి మాజీ జడ్పీటీసి అజేయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబు జగజ్జీవన్ రామ్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కేంద్ర మంత్రిగా, ఉపప్రధానిగా ఆయన చేపట్టిన అనేక సంస్కరణలు నేటికీ ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బాబుజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కులమతాలకు అతీతంగా సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన పిలుపునిచ్చారు. భారతదేశంలో ఆహార భద్రత కల్పించడంలో హరిత విప్లవాన్ని విజయవంతం చేయడంలో జగజ్జీవన్ రామ్ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందని గుర్తు చేశారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండే తుకారాం , సింగిల్ విండో ఛైర్మెన్ జాబోరే పెంటయ్య ,వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, డైలీ క్రికెట్ యూత్, బి ఆర్ ఎస్ యూత్ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది గోడిశేలా శంకర్, వడ్లురి ప్రభాకర్, పాల్గొన్నారు.

## పైప్ లైన్ పనులు పరిశీలన

**తాండూర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :**



తాండూర్ మండలం మాదారం గ్రామ పంచాయతీలోని పోచంపల్లి గ్రామంలో జరుగుతున్న మంచినీటి సరఫరా పైప్ లైన్ పనులను ఆదివారం సర్పంచ్ కుశ్నపల్లి లక్ష్మణ్, ఉపసర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా చేయాలన్న లక్ష్యంతోనే నూతనంగా పైపులైను నిర్మాణ పనులు చేపట్టామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ఇంటింటికి తాగునీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గొర్లపల్లి బానేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి

## మల్లెపూల నరయ్య

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 05, ప్రభాతవార్త:



ఈ నెల 6న మండలంలోని పిప్పిరి గ్రామంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఆర్థిక భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్తోందని తెలిపారు. పిప్పిరి సభ ద్వారా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణను ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా మండలంలోని భూతాయి చెరువు ఆయకట్టు విస్తరణ, ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సభకు కాంగ్రెస్ శ్రేణులు, మహిళలు, యువకులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ జల్కె పాండురంగ్, చిలుకూరి భూమన్న, విజేందర్, స్వామి, అరే పాండు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన రేపు ట్రాఫిక్ ఆంక్షలు

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 05, ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం పిప్పిరి గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో మండలంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి సభ ముగిసే వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఇచ్చోడ నుండి పిప్పిరి వరకు వన్ వే విధానాన్ని అమలు చేస్తామని, అడేగామ, పిప్పిరి, గిర్నూర్ గ్రామస్థులు ఆదిలాబాద్ లేదా నిర్మల్ వైపు వెళ్లాలంటే బజార్‌హత్నూర్, బోథ్ మీదుగా వెళ్లాలని సూచించారు. నిర్మల్ నుండి వచ్చే వాహనాలు జాతీయ రహదారిపై బోథ్ ఎక్స్ రోడ్, పోచర ఎక్స్ రోడ్, సోనాల మీదుగా సభాస్థలికి చేరుకోవాలని తెలిపారు. సభకు వచ్చే ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇచ్చోడ బస్టాండ్ నుండి దిగ్నూర్, గంగాపూర్, లక్ష్మీ ్మ నాయక్ తాండా మీదుగా కేటాయించిన పార్కింగ్ స్థలాలకు చేరుకోవాలని, రోడ్లపై వాహనాలు నిలపడం నిషిద్ధమని స్పష్టం చేశారు. అడేగామ, పిప్పిరి, గిర్నూర్ గ్రామ ప్రజలు తమ పశువులను రోడ్లపైకి రాకుండా చూసుకోవాలని, ఉదయం 8 గంటల లోపే వ్యవసాయ పనులు ముగించుకోవాలని డీఎస్పీ సూచించారు. భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ దృష్ట్యా ప్రజలందరూ పోలీసుల సూచనలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బాసర ఆలయ అభివృద్ధికి రూ. 225 కోట్లు

## మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి హర్షం

భైంసా, ఏప్రిల్ 05, ప్రభాతవార్త:



బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 225 కోట్లతో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని నిర్ణయించడం చారిత్రాత్మకమని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కొనియాడారు. ఆదివారం భైంసాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ భారీ నిధులు మంజూరు చేశారని తెలిపారు. అంతేకాకుండా, ముధోల్ నియోజకవర్గ కేంద్రంలో సుమారు రూ. 200 కోట్లతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ పాఠశాల ద్వారా విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ లభిస్తుందని, ఇది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ముధోల్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాల పట్ల కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని విఠల్ రెడ్డి పేర్కొన్నారు.

# బాసర ఆలయ అభివృద్ధికి రూ. 225 కోట్ల నిధుల విడుదల

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసా, ఏప్రిల్ 05, ప్రభాతవార్త:



బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం మరియు మాస్టర్ ప్లాన్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 225 కోట్ల నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేయడం శుభపరిణామమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం భైంసాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో అప్పటి ప్రభుత్వం అమ్మవారి ఆలయ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, ఆలయం శిథిలావస్థకు చేరినా పట్టించుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర ఆలయంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, రెండుసార్లు అధికారులతో సమీక్ష నిర్వహించి ఒకేసారి భారీ నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ నిధులతో ఆలయ పునర్నిర్మాణం, రాజగోపురాల నిర్మాణం, కోనేరు ఆధునికీకరణ, రోడ్ల విస్తరణ వంటి పనులు చేపడతారని తెలిపారు. తనికెళ్ల ఇంటిగ్రేటెడ్ కన్సల్టెన్సీ అంచనాల ప్రకారం మాస్టర్ ప్లాన్‌కు మొత్తం రూ. 327 కోట్లు ఖర్చవుతాయని పేర్కొన్నారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసరకు విచ్చేసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని, తన మనవడికి ఇక్కడే అక్షరాభ్యాసం చేయించడం ఆనందదాయకమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అనంతరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, సీనియర్ నాయకులు సాల్మీ రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రావుల రాము మాట్లాడుతూ.. బాసర నిధుల కోసం ఎమ్మెల్యే రామారావు పటేల్ అసెంబ్లీలో పదేపదే ప్రస్తావించి, ముఖ్యమంత్రిని కలిసి చేసిన కృషి ఫలితమే ఈ నిధుల విడుదల అని కొనియాడారు.

# కుప్టి ప్రాజెక్టు, యూనివర్సిటీపై సీఎం స్పష్టత ఇవ్వాలి: ఎమ్మార్పీఎస్

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 05, ప్రభాతవార్త:



బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి కీలకమైన కుప్టి ప్రాజెక్టు, యూనివర్సిటీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ విజ్ఞప్తి చేశారు. సోమవారం పిప్పిరి గ్రామానికి రానున్న ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా బోథ్ నియోజకవర్గం వివక్షకు గురవుతోందని, పుష్కలమైన జల సంపద, అటవీ వనరులు ఉన్నా అభివృద్ధిలో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన లక్ష ్యంగా సాగిన పాదయాత్ర ఈ ప్రాంతం నుండే ప్రారంభమై అధికారంలోకి రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న కుప్టి ప్రాజెక్టును పూర్తి చేయాలని, జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేయాలని కోరారు. అలాగే బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ శాశ్వత కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని, పిప్పిరి గ్రామానికి ఆనుకుని ఉన్న వర్తమన్నూర్ గ్రామాన్ని ముఖ్యమంత్రి దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇండ్ల ఎల్లన్న, నవీన్, సూర్యకాంత్, శంకర్, విద్యార్థి నేతలు లక్ష్మీ ్మకాంత్, పరమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

నిర్మల్, ఏప్రిల్ 05, ప్రభాతవార్త:



నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని, జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బాబు జగజ్జీవన్ రామ్ విశేష పాత్ర పోషించారని కొనియాడారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి, దళిత సంక్షేమానికి ఆయన అందించిన కృషి ఎంతో గొప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి శంకర్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, పరిశ్రమల జిల్లా మేనేజర్ నరసింహ రెడ్డి, యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి: సతీష్ రెడ్డి

ఖానాపూర్, ఏప్రిల్ 05, ప్రభాతవార్త:

ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని నిర్మల్ జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి పొద్దుటూరి సతీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడెం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల కోసం ముఖ్యమంత్రి రానున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లాలోని ప్రతి మండలం నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ సభ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.